మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, చిత్రంలో మావోయిస్టు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 11 : సీపీఐ మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యురాలు పోడియం సోమిడి అలియాస్ రోని బుధవారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఎదుట లొంగిపోయింది. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం. ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్‌కు చెందిన పోడియం సోమిడి ఆర్‌పీసీ కమాండర్ కుర్సం సమ్మయ్య ప్రోద్బలం, అతని మాటలకు ఆకర్షితురాలై 2019లో మిలిషియా సభ్యురాలిగా చేరారు. 12 బోర్ వెపన్‌ను వినియోగించినట్లు తెలిపారు. ఇదే సంవత్సరంలో 2వ సెంట్రల్ జోన్ కమిటీ కమాండర్ దొడ్డ పొజ్జ అలియాస్ ప్రకాశ్ దళ సభ్యురాలుగా సోమిడికి పదోన్నతి కల్పించారు. 2వ సెంట్రల్ రీజినల్ కంపెనీకి చెందిన నాయకుడు సాగర్‌కు గార్డుగా సంవత్సరం పాటు, తర్వాత 1వ ప్లటూన్ బి సెక్షన్‌లో సభ్యురాలిగా కొనసాగారు. పోడియం సోమిడిపై రూ. 4లక్షల రివార్డు ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. మావోయిస్టు భావజాలంపై విరక్తి, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ముఖ్య నేతలు పంచుకోవడం, విపరీతమైన పనిభారం, తిండిలో తక్కువ క్యాడర్‌పై వివక్ష, విచక్షణా రహితంగా కొట్టడం, ఛత్తీస్‌గఢ్‌లో పోలీస్ క్యాంపులు రావడం లాంటి కారణాలతో సాధారణ జీవితం గడిపేందుకు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లొంగిపోయిన వారికి అన్ని రకాల రాయితీలు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ములుగురూరల్, సెప్టెంబర్ 11 : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ చికిత్సను అందించేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి గుగుల్ మీట్ ద్వారా వైద్య సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని 500 ప్రాంతాలకుగాను 445ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. మిగిలిన వైద్య శిబిరాలను రెండు రోజుల వ్యవధిలో వైద్యాధికారులు పూర్తి చేయాలని సూచించారు. గర్భిణుల నమోదులో 100శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమయ పాలన పాటిస్తూ విధులకు హాజరవుతూ వైద్య సేవలలో లోపాలు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు.

గుడుంబా అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

వాజేడు, సెప్టెంబర్ 11 : గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పూసూరులో బుధవారం సాయంత్రం సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో ఇండ్లలో సోదాలు చేయగా దన్నూరి దయాకర్ వద్ద 12 లీటర్లు, నల్లబోయిన భాస్కర్ ఇంట్లో 18 లీటర్ల గుడుంబా దొరికినట్లు తెలిపారు. దానిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జోరుగా బెల్టు దందా

- 23గ్రామాల్లో వందకు పైగా బెల్టు షాపులు
- క్వార్టర్‌కు ఎంఆర్‌పీ కంటే రూ.40 నుంచి రూ.50 వరకు అదనం
- పట్టించుకోని ఆబ్కారీశాఖ

వెంకటాపూర్, సెప్టెంబర్ 11 : మండలంలో బెల్టు దందా జోరుగా నడుస్తుంది. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి వాడవాడలా ఉన్న చిరుదుకాణాలు, డబ్బాల్లో బెల్టు షాపులను నడుపుతున్నారు. మండలంలోని 23గ్రామాల్లో 100కు పైగా షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో చిన్న పిల్లలు, మహిళలు దుకాణంలోకి వెళ్లాలన్నా, ఆ వీధులగుండా వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైన్స్ షాపు యజమానులు ఉదయం 8గంటల నుంచే ఆటోలో గ్రామాల్లోకి మద్యం సరాఫరా చేస్తున్నారు. క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.40 అదనంగా బెల్టు షాపుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇక బెల్టు షాపు నిర్వాహకులు మరో రూ.40 నుంచి రూ.50 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. వైన్ షాపుల్లో విక్రయిస్తే ఎంఆర్‌పీకి అమ్మాల్సి వస్తుంది. అదే బెల్టు షాపుల్లో అదనంగా లాభం వస్తుంది. దీంతో వైన్ షాపు నిర్వాహకులు బెల్టు షాపులకు విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు కల్తీ మద్యంను విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. వైన్‌షాపులో దొరకని బ్రాండ్ బీర్లు, విస్కీ బెల్టు షాపుల్లో లభిస్తున్నాయని, కావాల్సిన బ్రాండ్ కోసం ఫుల్‌బాటిల్‌కు రూ.200 అదనంగా చెల్లించాల్సి వస్తుందని మద్యం ప్రియులు అంటున్నారు. బెల్టు షాపులను మూసివేయించాల్సిన ఆబ్కారీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాజేడు/ మంగపేట/ వెంకటాపురం (నూగూరు)/ వెంకటాపూర్, సెప్టెంబర్ 11 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్యాధికారులు వైద్య శిరాలు ఏర్పాటు చేశారు. వాజేడు మండలం పేరూరు పీహెచ్‌సీ పరిధి భువనపల్లి, లింగపేట గ్రామాల్లో 97 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేసినట్లు పేరూరు వైద్యాధికారి రహీల్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం శారద పాల్గొన్నారు. మంగపేట మండలం చుంచుపల్లిలో వైద్యురాలు యమున బృందం రాపిడ్ ఫీవర్ సర్వే జరిపి, డ్రైడే నిర్వహించారు. అనంతరం జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది శైలజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలం మైతాపురంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో అప్పయ్య పరిశీలించారు. రోగులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యాధికారులు భవ్యశ్రీ, ఆశీష్, సిబ్బంది రాఘువులు ఉన్నారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనిత, ఏఎన్ఎంలు స్వర్ణలత, వజ్ర, ఆశ కార్యకర్తలు సబిత, రాజ్యలక్ష్మి, కవిత, స్వాతి పాల్గొన్నారు.

వెంకటాపురం (నూ) : రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వెంకటాపురం : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

వెంకటాపురం(నూగూరు)/ వెంకటాపూర్, సెప్టెంబర్11 : సమతుల ఆహారంతోనే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవోలు ముత్తమ్మ, శిరీష అన్నారు. బుధవారం వెంకటాపురం (నూ) మండలం చర్చిపేట, వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించగా వారు హాజరై మాట్లాడారు. సెంటర్ ద్వారా రోజు వారీగా పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, విజేందర్, అనంతలక్ష్మి, టీచర్లు రాజేశ్వరి, సరస్వతి, భాగ్యలక్ష్మి, వెంకటరమణ, కృష్ణకుమారి, మాధవి, సంధ్య, రజిని, సబిత పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

మంగపేట, సెప్టెంబర్ 11 : మండలంలోని కమలాపురం గోదావరి రోడ్డు వీధిలో నున్నా కస్తూరి (26) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నున్నా నాగేశ్వర్‌రావుతో 2019లో కస్తూరికి వివాహం జరిగింది. వారికి ఇద్దరు కొడుకులు కాగా నాగేశ్వర్‌రావు కూలీ పనులకు వెళ్తుంటాడు. బుధవారం ఉదయం 7 గంటలకు ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి సెంట్రింగ్ పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికే భార్య కస్తూరి ఇంటిముందు షెడ్డుకు చీరతో ఉరేసుకొనొ మృతిచెంది ఉంది. భార్య మృతిపై అనుమానం ఉందని భర్త నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విఘ్నాలు తొలగి.. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని..

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన కేసీఆర్ అభిమాని

పూజలు చేస్తున్న నరేశ్‌కుమార్

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 11: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విఘ్నాలు అన్ని తొలగిపోయి మళ్లీ సీఎం కావాలని కేసీఆర్ వీరాభిమాని, బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు మైనాల నరేశ్ కుమార్ బుధవారం రెడ్డి కాలనీలోని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే తెలంగాణ ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని, బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చేశాడన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగానే ఉన్నారన్నారు. రాష్ట్రానికి పట్టిన విఘ్నాలు తొలగిపోయి, తెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆదిదేవుడిని వేడుకున్నట్లు చెప్పారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 11 : ఇటీవల కురిసిన వర్షాలతో రాష్ట్రంలో ఆర్థిక, ప్రాణ నష్టం జరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కొమురయ్య భవన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా రాజ్‌కుమార్ మాట్లాడారు. ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామతో పాటు ఇతర జిల్లాల్లో చెరువులకు గండ్లు పడి భారీగా పంట నష్టం జరిగిందన్నారు. వందలాది నివాస గృహాలు నీట మునిగి ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ఇంత జరిగినా కేంద్రంలోని బీజేపీ ఎలాంటి ఆర్థిక సాయం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్, నాయకులు క్యాత రాజు సతీశ్‌కుమార్, నేరెల్ల జోసెఫ్, జోగేశ్, పీక రవి, కాంతారావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 11 : ఆటో డ్రైవర్లు, ఓనర్లకు మోటర్ వాహనాల చట్టాలపై అవగాహన ఉండాలని, మద్యం తాగి వాహనం నడుపొద్దని సీఐ నరేశ్‌కుమార్ అన్నారు. బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లు, ఓనర్లకు మోటర్ వాహనాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించగా సీఐ మాట్లాడారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్, ఆటో పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధలు తప్పకుండా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఆటో టాప్ నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పడేసిన బ్లూచిప్

సెన్సెక్స్ 398, నిఫ్టీ 122 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాలోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడంతో ప్రారంభంలో లాభపడిన సెన్సెక్స్ చివర్లో భారీగా నష్టపోయింది. అటు నిఫ్టీ తన 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. టాటా మోటర్స్, రిలయన్స్, ఎల్ అండ్‌టీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 398.13 పాయింట్లు కోల్పోయి 81,523.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 122.65 పాయింట్లు కోల్పోయి 24,918.45 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో టాటా మోటర్స్ అత్యధికంగా 6 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కూడా నష్టపోయాయి. కానీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ దిగువకు పడిపోయినప్పటికీ ఆసియా మార్కెట్లలో కరెక్షన్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఆయిల్ అండ్ గ్యాస్ 2.25 శాతం, మెటల్ 1.35 శాతం, యుటిలిటీ 1.29 శాతం, ఆటో 1.17 శాతం, కమోడిటీస్ 1.14 శాతం, టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి.

వాణిజ్య

మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికి తీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కెసీపీ సిమెంట్స్, హెఏఎల్, మిథాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

క్యూసీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్కిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.

2 రోజుల్లో 1,000 అప్

మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

మళ్లీ భారత్‌కు ఫోర్డ్?

న్యూఢిల్లీ/చెన్నై, సెప్టెంబర్ 11: భారతీయ మార్కెట్‌కు గుడ్‌బై చెప్పిన అగ్రరాజ్యం ఆటో దిగ్గజం ఫోర్డ్.. త్వరలోనే రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ఆ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రంతో మూడు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని కొనసాగించాలని, చెన్నైలోని ప్లాంట్‌ను తిరిగి తెరవాలని స్టాలిన్ కోరారు. ఈ మేరకు తమిళనాడు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో ఫోర్డ్ పునరాగమనంపై తిరిగి అంచనాలు ఏర్పడుతున్నాయి. కాగా, 2021లో భారతీయ మార్కెట్ నుంచి ఫోర్డ్ వైదొలగిన విషయం తెలిసిందే. భారీ నష్టాలతోనే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. అంతేగాక చెన్నైలోని తమ ప్లాంట్‌నూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు అమ్మాలనుకున్నది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రణాళికల నుంచి వెనక్కి తగ్గింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కొత్త ప్రణాళికలకు శ్రీకారం కూడా చుట్టింది. అయితే మళ్లీ పెద్దగా కదలికలేవీ లేక పోవడంతో ఫోర్డ్ రాక సందిగ్ధంలో పడింది. కానీ స్టాలిన్ అభ్